# ఛీ...

- వడ్లమూడి దుర్గాంబ

"ఈ రోజు సాయంత్రం మంత్రిగారు గెస్ట్‌హౌస్‌లో దిగుతారటరా... వెళ్ళి కలవమన్నారు. మా ఎస్.ఇ.గారు" మధ్యాహ్నం ఆఫీసు నుండి రాగానే కొడుకుని పిలిచి చెప్పాడు ఖాంతారావు.

ఓ క్షణం అయోమయంగా చూసి ఆపై అర్థమైనట్టు తలూపాడు శ్రీనాథ్.
కొడుకు మొహంలో తానాశించిన వెలుగు కనబడలేదు కాంతారావుకి.

"ఏమిట్రా నీ అనుమానం! మా ఎస్.ఇ.గారికి ఆ మంత్రిగారు దగ్గర బంధువులట! ఆయన మంత్రి గారితో ఫోన్‌లో మన గురించి మాట్లాడతానన్నారు. మంత్రిగారు తప్పకుండా నీ పేరు కలెక్టరుగారికి రికమెండ్ చేస్తారు." ఈ మధ్యకాలంలో తండ్రిలో అంతటి ఉత్సాహం ఎప్పుడూ చూడలేదు శ్రీనాథ్! తనకు ఉద్యోగమొస్తుందని కాకపోయినా తండ్రి మొహంలో అంత ఉత్సాహం, ఆనందం చూడ్డం కొంత సంతోషం కలిగిస్తోంది.

అవును మరి! ఈ కరువు రోజుల్లో అటెండరు ఉద్యోగంతో ఆరుగురు సంతానం బరువును మోస్తున్నవాడాయన.

వరదల పర్యటనలో వున్న ఓ మంత్రిగారు ఈ వూరు వస్తున్నారు. ఆయన కాంతారావు పని చేసే ఆఫీస్ ఎస్.ఇ. (సూపరింటెండెంట్ ఇంజనీర్) గారికి దగ్గర బంధువులు! తన సేవలనందుకుంటున్న ఎస్.ఇ.గారి కాళ్ళా వేళ్ళాపడి - ఆయన ద్వారా మంత్రిగారి రికమెండేషన్ లెటర్ సంపాదిస్తే ఆ ఉద్యోగం తన కొడుక్కి రావచ్చు. ఇదీ కాంతారావు ఆశ, ఆలోచన. ఆ ప్రయత్నం చేశారాయన.

ఎస్.ఇ.గారు కాసేపు 'ఆ... ఊ...' అని ఆ మంత్రిగారు చాలా స్ట్రిక్టు! అయినా - నీ పరిస్థితి ఆయనకి ఫోన్‌లో చెబుతాలే! ఆ తరవాత నీ అదృష్టం మరి - సాయంత్రం నీ కొడుకుని తీస్కెళ్ళి మంత్రి గారికి కనబడు......"అన్నాడు. ఏనుగును ఎక్కినట్టే ఇంటికి వచ్చాడు కాంతారావు! తీరా చూస్తే తన ఆనందంలో నూరో వంతు కూడా కొడుకులో కనబడలేదాయనకు. 'వాడికీ ఇంటర్వ్యూలకి తిరిగి తిరిగి విసుగొచ్చేసింది పాపం...!' మనసులోనే అనుకుని నిట్టూర్చాడాయన! శ్రీనాథ్ మాత్రం తండ్రిని జాలిగా చూశాడు — "పదవి కోసం చొక్కాల్లా పార్టీలు మార్చడానికీ ప్రాణాలు తీయడానికీ వెరవని రాజకీయ జాతికి చెందినవాడు - తమ నుండీ ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా - సాయం చేస్తాడనుకుం టున్నాడు. ఈ పిచ్చి తండ్రి"!

సాయంత్రం ఆఫీస్ నుండి రాగానే కొడుకుని హడావుడిగా బయలుదేరదీశాడు కాంతారావు. చెప్పలేనంత అనాసక్తిగా వుంది శ్రీనాథ్‌కి! అయినా తండ్రిని కష్టపెట్టడం, నిరాశపర్చడం ఇష్టం లేక బయలుదేరాడు: "నీకు అన్నీ ఫస్ట్ క్లాస్ మార్కులు కదరా! సర్టిఫికెట్లు కూడా తీసుకో" — ఎంతో సంబరంగా చెబుతున్న తండ్రిని చూసి నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు శ్రీనాథ్‌కి! "నాలాంటి సర్టిఫికెట్లు వున్నవాళ్ళు ఈ దేశంలో లక్షలున్నారు నాన్నా!, అయినా మీ



పిచ్చిగానీ - ఆయన పచ్చనోట్లు తీసుకెళ్తే ప్రేమగా చూస్తాడేమోగానీ ఈ పనికిమాలిన సర్టిఫికెట్లు చూస్తాడా చెప్పండి-" ... కొడుకు మాటల్లో వినబడుతున్న నిరాశ - ఒక్కసారిగా కాంతారావు ఒంట్లో చెప్పలేని నిస్సత్తువను నింపింది.

"అంత నిరాశ పనికిరాదురా మనిషికి! ఏమీలేని మనలాంటి వారికి ఆశే పెద్ద అండ! మనం వున్న పరిస్థితుల్లో ఇంకా ఊపిరి పీలుస్తున్నామంటే అందుకు కారణం అదొక్కటే — కాదంటావా?" నిర్వికారంగా చెబుతున్న తండ్రిని ఆశ్చర్యంతో చూశాడు శ్రీనాథ్ — ఆయన. తననుకున్నంత అమాయకుడూ కాదు - పిచ్చివాడూ కాదు - తనలో ప్రాణాన్ని పోసిన ఆయన - దాన్ని నిలపడానికి ఆశ అనే జీవం నింపడానికి ప్రయత్నిస్తున్నాడు. తనిలా జీవచ్ఛవంలా ప్రవర్తిస్తూ తండ్రిని ఎంత బాధపెడుతున్నాడు! ఒక్క క్షణం మనసంతా వికలమైపోయింది

ప్రజలకు అధికారాలుండి, ప్రజాప్రతినిధులు ఆ అధికారాలను అమలు చేయడానికి మాత్రమే పదవుల్లో వుంటే అది ప్రజాస్వామ్యం. అందుకు బదులు, ప్రజలు తమ ప్రతినిధుల్ని కలుసుకోవడానిక్కూడా అష్టకష్టాలు పడవలసిన పరిస్థితివుంటే అది అప్రజాస్వామికం. అప్రజాస్వామికంలో ప్రజాప్రతినిధులే 'సరికొత్త దేవుళ్ళు!'

ఆ కొత్త దేవుళ్ళు గుడిలోని లింగాన్నీ, గుడినీ మింగే వాళ్ళని తెలిసినా, ఆ దేవుళ్ళ కడకంటి చూపుకోసం దేవుళ్ళాడ్డం ఆ అన్యాయాన్ని బలపరచినట్టవుతుంది. ఆత్మాభిమానం వున్న వాళ్ళు ఆ అక్రమాన్ని వ్యక్తిగత స్థాయిలోనైనా నిరసించక తప్పదు.

శ్రీనాథ్‌కి. తండ్రి కోసమే తెచ్చి పెట్టుకున్న ఉత్సాహంతో బయలుదేరాడు.

తండ్రీ కొడుకులు వెళ్ళేప్పటికే గెస్ట్‌హౌస్ పెళ్ళివారిల్లులా కళకళలాడుతోంది. అప్పుడే వచ్చినట్టున్నారు మంత్రిగారు కారు దిగి యింకా లోపలికి వెళ్ళలేదు. బయట నిలబడే తన చుట్టూ వున్న పోలీస్ ఆఫీసర్స్‌తో ఏదో మాట్లాడుతున్నారు. వాళ్ళ డ్రస్సులు వాళ్ళ హోదాల్ని తెలియ జేస్తున్నాయి. కానీ శ్రీనాథ్‌కి మాత్రం వాళ్ళంతా - మంత్రిగారు నవ్వినపుడు నవ్వడానికీ — ఏడ్చినపుడు ఏడ్వడానికీ ఏర్పాటుచేసిన మరమనుషుల్లా కనిపించారు! పదవిలో వున్న ఓ రాజకీయ నాయకుడి ముందు పిల్లుల్లా వున్న వీళ్లు ఆ పదవిని ఆ నాయకుడికి ప్రసాదించిన ప్రజల




పళ్లు మాత్రం 'మానీటర్స్'లా ప్రవర్తిస్తారు కదా! మనసులోనే ఆశ్చర్యపోయాడు శ్రీనాథ్!

ఆ బంగ్లాకి ఇవతలిపక్క నిలబడ్డారు శ్రీనాథ్, కాంతారావు. వాళ్ళ పక్కనే వాళ్ళలాగే మంత్రిగారితో తమ మొర వినిపించుకోవడానికి వచ్చినవారు ఇంకా కొందరున్నారు. శ్రీనాథ్ పరీక్షగా చూశాడు వాళ్ళం దర్నీ! అంతా సాదాసీదా, బీదా బిక్కీ జనం! ఏదో దేవుని దర్శనానికొచ్చినట్టు - వణుకుతూ - భక్తి శ్రద్ధలతో నిలబడ్డవాళ్ళని చూడగానే ఒక్కసారిగా శ్రీనాథ్‌కి దిగులు కలిగింది. ఒకప్పుడు ఈ ఘనమైన మంత్రిగారు తమ ముందు అలాగే నిలబడ్డారు. "మీరు నాకే పదవి భిక్ష పెడితే — మీకు సేవ చేసుకుంటాను" అని వాగ్దానాలు చేశాడు. అప్పుడు తామంతా భిక్షగా పారేసిన అధికారంతో - ఇప్పుడు తమనే అడుక్కుతినే వెధవల్లా చూస్తున్నాడు!

శ్రీనాథ్‌కి చెప్పలేనంత అసహనంగా వుంది. ఎప్పటికి ఆయన తమని పిలిచేది? బయట ఓ అర గంట లెక్చర్ ఇచ్చాక మంత్రిగారు నిదానంగా లోపలి కెళ్ళారు. అప్పటి వరకు మంత్రిగారితో తన గోడు వెళ్ళబోసుకోవాలని పడిగాపులు పడుతున్న ఓ ముసలమ్మ పరుగు పరుగున లోపలికి దూసుకెళ్ళబోయింది. అంతే! ఒక్కసారిగా - గుమ్మం దగ్గర నిలబడి వున్న సెక్యూరిటీ గార్డ్ చెయ్యి ఆమెను బలంగా వెనక్కి తోసింది.

అసలే ముసలి ప్రాణం! పైగా ఎప్పటి నుండి పడిగాపులు పడివుందో - ఆ తోపుకి ఆమె వెనక్కి విరుచుకుపడిపోయింది. శ్రీనాథ్ మనసు విలవిల్లాడింది. అప్పటి వరకూ ఆమెతో వున్న శ్రీనాథ్ వయసు యువకుడొకడు వచ్చి లేపి పక్కకి తీసి కెళ్ళాడు. ఆ యువకుడు ఆ ముసలామెనే తిడుతున్నాడు! వాళ్ళిద్దరి సంభాషణని బట్టి అతను ఆ ముసలామెకి మనవడనీ - ఆ మనవడి గురించి చెప్పకోడానికే ఆమె వచ్చిందనీ అర్థమైంది శ్రీనాథ్‌కి!

ఆ ముసలామైనా కోపంతో చిన్నగా ఏదో గొణుగుతోందిగానీ ఆ యువకుడు మాత్రం నిదానంగా - ఆమెని శాంతపరుస్తున్నాడు. శ్రీనాథ్‌కి ఆశ్చర్యమేసింది. అంత ఉడుకురక్తంలో కూడా ఎంత సహనం! అది సహనమా! యువతలో చచ్చిపోయిన చైతన్యానికి చిహ్నమా! అంతలోనే మరో ఆలోచన మెదిలింది శ్రీనాథ్‌లో — ఒకవేళ ఆ యువకుడు ఆ ముసలామెకి జరిగిన అవమానానికి ఆవేశపడి - ముందుకురికినా ఏం జరిగేది - ఎవరూ అతని మొర వినిపించుకోకపోగా — చుట్టూ కాపలా కాస్తున్న పోలీసులు - అతనిపైనే ఏదో ఒక కేసు పెట్టి లోపలికి తోసేవాళ్ళు!

ప్రజల రక్షణ కోసం నియమింపబడిన పోలీసు వ్యవస్థ - ప్రజల్ని వదిలేసి - ప్రజలకు సేవకులమని చెప్పకుంటున్న రాజకీయ నాయకులకు కొమ్ము కాస్తోంది! అడిగే నాథుడెవడు? ఆలోచనల్లో కాలం తెలవడంలేదుగాని కాళ్ళు పీకుతుంటే గుర్తొచ్చింది శ్రీనాథ్‌కి! మరో గంట గడిచిపోయిందని! సూటూ బూటూ వేసుకున్న పెద్ద పెద్ద అధికారులు లోపలికీ బైటకీ హడావుడిగా తిరుగుతున్నారు. అసహనంగా చూస్తున్నాడు శ్రీనాథ్. "హలో శ్రీనాథ్" అతని ఆలోచనల గొలుసుని తెంపుతూ పిలుపు వినబడింది వెనక నుండి. ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు శ్రీనాథ్! వాసు! డిగ్రీలో తన క్లాస్‌మేట్! పక్కనే అతని తండ్రి! శ్రీనాథ్ దగ్గరగా వచ్చాడు వాసు. "మంత్రి గారితో పనా?" నెమ్మదిగా అడిగాడు.

శ్రీనాథ్ తలూపాడు. "అవునురా- మనలాంటి మధ్య తరగతి మనుషులకి- కిరసనాయిల్‌కీ - సినిమా టికెట్లకీ క్యూలో నిలబడినట్టే పాలకుల దర్శనానికి కూడా గంటల కొద్దీ వెయిట్ చేయాల్సొస్తోంది. సరుకు తక్కువయితే క్యూ పెరిగినట్టు - మన మీద ప్రేమ లేని నాయకుల్ని చూడాలంటే ఇలా వెయిటింగ్ టైం పెరిగిపోవాల్సిందే!" - నవ్వుతూ నిదానంగా అన్నా - ఆ మాటల్లో అంతులేని ఆవేశం - కోపం - కసి- వున్నాయి. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి వుంది. అన్నిటినీ మించి దెబ్బతిన్న ఓ యువకుడి ఆత్మాభిమానం వుంది. వాసు అతని మాటలకి నవ్వుతూ - "బాగుంది. నీ థియరీ - అయినా ఆయన దర్శనం కావాలంటే ఇంకా టైం పడుతుంది. అలా పోయి టీ తాగి వద్దాం రా" అన్నాడు. తండ్రికి చెప్పి వాసు వెనక నడిచాడు శ్రీనాథ్.

"ఏమిటి విషయం..." టీకి ఆర్డరిచ్చి చిన్న స్వరంతో అడిగాడు వాసు. ఓ క్షణం చెప్పాలా వద్దా అని సంశయించి - ఆ పై - 'ఆ... ఆ ఉద్యోగం వచ్చేదీ లేదు పెట్టేదీ లేదు. చెప్తే మాత్రం మునిగిపోయేదేముంది' అనుకుంటూ చెప్పాడు అసలు విషయం. అంతా విని- "నీది బాడ్‌లక్‌రా శ్రీనాథ్" అన్నాడు వాసు! అర్థం కానట్టు చూశాడు శ్రీనాథ్!

"ఆ జాబ్ ఎప్పుడో నాకు రిజర్వు అయిపోయింది..." ఉలిక్కిపడ్డాడు శ్రీనాథ్. "యస్; ఇప్పుడు మా నాన్న గారూ నేనూ అందుకే వచ్చాం! కాకపోతే మాది 'ఉత్తరం' కాదు 'దక్షిణం'. మంత్రి గారికి ఇప్పటికే డబ్బు ముట్టింది. ఇక ఆఖరుసారిగా ఒ.కే. అనిపించుకోడానికి వచ్చాం..." చెప్పడం అయిపోయినట్టుగా వాసు మౌనంగా టీ తాగుతున్నాడు. శ్రీనాథ్ మనసు బ్లాంక్‌గా అయిపోయింది.

ఆ ఉద్యోగం తనకి రాదని ముందు నుండే తెలుసు! అయినా ఇది వరకూ ఆ మంత్రి దగ్గరికి వెళ్ళడం వేరు. ఇప్పుడు - ఆ ఉద్యోగం పొందబోతున్న వ్యక్తిని చూసి కూడా ఇంకా వెళ్ళాలనుకోవడం- కేవలం తన మూఢత్వమే అవుతుంది. కానీ తండ్రిని ఒప్పించడం ఎలా?! - ఆయనకీ నిజం చెప్పినా నమ్మరు. తనకి ఇష్టం లేక ఏదో సాకు చెబుతున్నాననుకుంటారు- ఓ పది నిముషాల అంతర్మథనం తర్వాత - కేవలం- తండ్రిని హర్ట్ చేయడం ఇష్టం లేక, వెళ్ళాలనే నిర్ణయించుకున్నాడు శ్రీనాథ్.

మరో అరగంట తర్వాత మంత్రి గారిని కలుసుకునే భాగ్యం కలిగింది. కాంతారావు వంగి వంగి వినయంగా నమస్కారాలు పెడుతూ చెప్పాడు. తనను ఎస్.ఇ.గారు పంపినట్టు చెబుతూ "మీకు ఫోన్" అంటూ నసిగాడు. "ఊ" అంటూ హుందాగా తలూపారు మంత్రిగారు, ఫోన్ వచ్చినట్టుగా! తరువాత నింపాదిగా శ్రీనాథ్ వంక చూశాడు. మోచేత్తో శ్రీనాథ్‌ని పొడిచాడు కాంతారావు- 'దణ్ణం పెట్టు' అన్నట్టు. తండ్రి భావం అర్థమవుతున్నా- శ్రీనాథ్ రెండు చేతులూ పైకి లేవలేదు జోడించడానికి.

అతన్ని చూస్తున్న కొద్దీ వాసు మాటలే చెవుల్లో మారు మోగుతున్నాయి. అతనికి తనెందుకు వంగి వంగి దణ్ణాలు పెట్టాలి. అతను తనకి జన్మనిచ్చిన తండ్రి కాదు! చదువు చెప్పిన గురువు కాదు! కనీసం

తన శ్రేయస్సు కోరే మంచి మనిషి కూడా కాదు! పోనీ- అతని గురించి ఏమీ తెలియకపోయినా - ఏ బస్సులోనో, రైల్లోనో పరిచయమైన తోటి ప్రయాణీకుడిని గౌరవించినట్టు నమస్కారం పెట్టొచ్చు! కానీ ఇప్పుడు అతనేమిటో - అతని వ్యక్తిత్వమేమిటో తెలిశాక - శ్రీనాథ్‌కి అక్కడ నిలబడడమే ముళ్ళ మీద నిలబడినట్టుంది. శ్రీనాథ్ ఆలోచనలు సాగుతున్నాయి. కాంతారావు ఏదో మొర పెట్టుకుంటున్నాడు. మంత్రి గారు చిద్విలాసంగా నవ్వుతూ - కాంతారావు చెప్పేది ఏదో హరికథలా వింటూ - మధ్య మధ్య పక్కనున్న ఓ అధికారితో ఏవో 'జోక్స్' చెబుతున్నాడు.

శ్రీనాథ్ రక్తం ఉడికిపోతోంది. పిడికిళ్ళు బిగపట్టి నిగ్రహించుకుంటున్నాడు. అంతా విన్నాక శ్రీనాథ్‌ని చూస్తూ... "ఆ... ఏమోయ్ నీ పేరు శ్రీనాథ్... బియస్సీ... ఫస్ట్‌క్లాస్... గుడ్..." శ్రీనాథ్ నిర్లక్ష్యంగా వింటున్నాడు. "చూడు బాబూ... నువ్వు బాగా చదువుకున్నావు. ఆలోచనా శక్తి - ఆవేశం వున్న యువకుడివి! మన దేశంలో యువతరానికి ప్రతీకవి - మీలాంటి యువకులే ఈ దేశ ప్రగతికి పట్టుకొమ్మలయ్యా..." శ్రీనాథ్‌కి పరమ అసహనంగా వుంది. దెయ్యాలు వేదాలు వల్లిస్తుంటే ఎలా వుంటుందో - అలా వున్నాయి ఆ మాటలు.

శ్రీనాథ్ బద్దలవ్వబోతున్న అగ్ని పర్వతంలా వున్నాడు. లావాలా పొంగుతున్న ఆవేశాన్ని అణవడానికి ఊపిరిని కూడా బిగబట్టి వింటున్నాడు. "నేను అవినీతిని సహించనయ్యా... నా గురించి తెలియక వచ్చినట్టున్నావ్ నువ్వు! అసలు నువ్వు చేసిన పనికి నాలాంటి నీతి-గల నాయకుడు క్షమించ కూడదు. కానీ నేను కాబట్టి..."

"ఆగండి" నెమ్మదిగా అన్నా శ్రీనాథ్ కంఠంలో చెప్పలేనంత కరకుదనముంది. అప్పటికే గుమ్మం దగ్గరున్న సెక్యూరిటీ గార్డు అలర్ట్ అయిపోయాడు.

"క్షమించండి సార్! మీరింతటి స్ట్రిక్ట్ మనుషులని తెలియకే వచ్చాము! మీరు చూపిన మార్గంలో మేము నడవలేక పోతున్నందుకు చింతిస్తూ - ఏదో మాకు తెలిసిన దారిలో నడుస్తూ ఈ దేశాన్ని రక్షించుకుంటున్నందుకు సంతోషిస్తూ- శలవు తీసుకుంటున్నాను...." తండ్రి చేయి పట్టుకుని గబగబా బయటికి తీసుకొచ్చేసాడు శ్రీనాథ్. అతని మాటలు ఓ నిముషం ఆలస్యంగానైనా అక్కడున్న వారందరకీ అర్థమయ్యాయి. మాటలు అంత అమర్యాదకరంగా లేకపోయినా అందులో ఏదో తీవ్ర నిరసన వున్నట్టూ అలాంటి ధోరణి వల్ల ముందు ముందు చాలా ప్రమాదమున్నట్టూ వాళ్ళకు అర్థమయింది.

"నా ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరు చేసావు కదరా" బయటికి వచ్చిన మూడు నిముషాలకి తేరుకుని రోడ్డు మీద నడుస్తూ అంటున్న తండ్రి మాటల వెంటనే "ఛీ..." అన్న ఒక్క అక్షరం తూటాలా దూకింది శ్రీనాథ్ నోటి నుంచి. పేరుకుపోయిన ఆవేశమంతా ఆ మాట ద్వారా బయటికి వచ్చాక గానీ అతని ఆత్మాభిమానం శాంతించలేదు. ◆

## 'ఏ సొమ్ము దేనికి ప్రాప్తో'

ముస్లిం నాయకుడు సర్ సయ్యద్ అహమద్ అలీఘర్ విశ్వవిద్యాలయం కోసం విరాళాలు ప్రోగుచేస్తుండగా ఒకనాడు ఒక వేశ్య ఆయనకు నమస్కరించింది.

"ఏమమ్మా నాకు నమస్కారం చేశావు. నేను విరాళాలు ఇచ్చిన వారికే ప్రతి నమస్కారం చేస్తున్నాను" అని అహమద్ అన్నారు.

"అయితే నేను మీకు మూడు లక్షల రూపాయిలు విరాళం ఇస్తున్నాను. తీసుకోండి" అన్నది. ఆయన ఎంతో ఆప్యాయంగా స్వీకరించి కృతజ్ఞతలు తెలిపారు.

'వేశ్య సొమ్ము మనకేల' అని కొందరు సర్ సయ్యద్‌కు సలహా ఇవ్వగా- "మిత్రులారా విశ్వ విద్యాలయంలో అన్ని హంగులూ సౌకర్యాలూ కావాలి కదా. ఈ సొమ్ముతో 'టాయ్‌లెట్లు' ఏర్పాటు చేద్దాం సరేనా అన్నారు అహమద్.

—ఎం.ఎస్.ఎం




ఒక స్త్రీని చెరిస్తే - అది 'మానభంగం'

ఒక వ్యవస్థని చెరిస్తే - అది 'రాజకీయం'

పరగడుపునే బ్రాందీ సేవించి, పబ్లిక్‌గా గాంధీని స్తోత్రం చేసే ఈ రాజకీయ వ్యవస్థపై సంధించిన క్షిపణి-



కొమ్మనాపల్లి గణపతిరావు

తదుపరి సీరియల్ అతి త్వరలో